క్లుప్తంగా

నేడు స్వచ్ఛ సంకల్ప ర్యాలీ

సామర్లకోట: జగనన్న స్వచ్ఛ సంకల్పంలో భాగంగా బుధవారం పట్టణ పరిధిలో ర్యాలీ నిర్వహిస్తున్నట్టు మున్సిపల్ కమిషనర్ సీఎంఏ నయీం అహ్మద్ మంగళవారం సాయంత్రం ఒక ప్రకటనలో తెలిపారు. మున్సిపల్ కార్యాలయం నుంచి స్థానిక స్టేషన్ సెంటర్ వరకూ ర్యాలీ జరుగుతుందని తెలిపారు. ఈ ర్యాలీలో చైర్‌పర్సన్, వైస్‌చైర్మన్లు, కౌన్సిలర్లు, కోఆప్షన్ సభ్యులు, మెప్మా సిబ్బంది పాల్గొంటారన్నారు.

రాము హత్యను ఖండించిన ఏపీ మాల మహానాడు



సమావేశంలో మాట్లాడుతున్న ఏపీ మాల మహానాడు రాష్ట్ర అధ్యక్షుడు రాజు తదితరులు

పిఠాపురం: తొండంగి మండలం శృంగవృక్షంలో దళిత యువకుడు నడిపల్లి రాము హత్యను ఏపీ మాల మహానాడు నాయకులు ఖండించారు. పిఠాపురంలో మంగళవారం ఏపీ మాల మహానాడు పిఠాపురం డివిజన్ ఆధ్వర్యంలో రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు ఎం.కృపానందం అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో పలువురు నేతలు మాట్లాడారు. ఈ కేసులో నిందితులకు వెంటనే శిక్ష పడేలా ప్రత్యేక న్యాయస్థానంలో విచారణ జరిపేలా చూడాలని డిమాండ్ చేశారు. మృతుని కుటుంబానికి తగిన న్యాయం జరగకపోతే తీవ్ర స్థాయిలో ఉద్యమిస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో గుబ్బల రాజు, దారా వెంకటరావు, బందిలి సూరిబాబు, దడాల సత్తిబాబు, దడాల చినరాజు, దుర్గాడ సింహాచలం, కర్రి వీరబ్బాయి తదితరులు పాల్గొన్నారు. ఈసందర్భంగా వారు మృతునికి ఘనంగా నివాళులర్పించారు.

నూకాలమ్మ ఆలయం స్వాధీనం



నూకాలమ్మ ఆలయాన్ని స్వాధీనం చేసుకున్న ఇన్‌స్పెక్టర్, ఈఓలు

సామర్లకోట: స్థానిక స్టేషన్ సెంటర్‌లో ఉన్న నూకాలమ్మ ఆలయాన్ని దేవాదాయ శాఖ అధికారులు స్వాధీనం చేసుకున్నారు. ఆలయ ఆస్తులపై వివాదం చెలరేగడంతో ఆలయాన్ని దేవదాయ శాఖకు అప్పగించాలని కోర్టులో కేసు నమోదైంది. దాంతో ఇటీవల దేవదాయశాఖకు అనుకూలంగా తీర్పు వచ్చింది. ఈ మేరకు డిప్యూటీ కమిషనర్ మేడేపల్లి విజయరాజు ఆదేశాల మేరకు ఆలయ స్థలానికి రక్షణ ఏర్పాట్లు చేశారు. కాగ మంగళవారం ఆలయ రికార్డులను దేవదాయ శాఖ ఇన్‌స్పెక్టరు ఫణికుమార్ పరిశీలించి స్వాధీనం చేసుకున్నారు. ఆలయ పర్యవేక్షణ బాధ్యతను పెద్దాపురం మహారాణి సత్రం ఈఓ జగన్నాథ శ్రీనివాస్‌కు అప్పగించారు. బసివిరెడ్డి సత్రం సీనియర్ అసిస్టెంట్ రత్నలీల, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

ప్రాధాన్యం మేరకు నీరివ్వండి



వీకే రాయపురంలోని శివారు ప్రాంత భూములను పరిశీలిస్తున్న ఏఓ, రైతులు

సామర్లకోట: ప్రాధాన్య క్రమాన్ని బట్టి పొలాలకు నీరు ఇవ్వాలని వీకే రాయపురం రైతులు డిమాండ్ చేస్తున్నారు. గ్రామంలోని శివారు ప్రాంత పొలాలకు నీరు అందడం లేదని దాంతో అవి ఎండిపోయే ప్రమాదం ఉన్నదని రైతులు ఇంటి రమేష్, వెలమర్తి శ్రీనివాసులు ఇరిగేషన్, వ్యవసాయ అధికారులకు ఫిర్యాదులు చేశారు. దాంతో మంగళవారం ఏఓ ఐ.సత్య పంట పొలాలను పరిశీలించారు. వీకే రాయపురం శివారు ప్రాంతంలో పంట పొట్ట దశలో ఉన్నదని నీరు ఇవ్వాలని ఇరిగేషన్ ఏఈ నాగేశ్వరరావు దృష్టికి తీసుకువెళ్లారు. రెండు రోజుల్లో శివారు ప్రాంత రైతుల వంతు వస్తుందని ఆ సమయంలో ఎక్కువ స్థాయిలో నీరు పారేలా చేస్తామని ఇరిగేషన్ అధికారులు హామీ ఇచ్చారు. నీరు అవసరం లేని ప్రాంతాల్లో నీరు వృథా పోతుందని, అటువంటి నీటికి అడ్డుకట్ట వేసి అవసరం ఉన్న ప్రాంతాలకు నీరు ఇవ్వాలని రైతులు డిమాండ్ చేశారు. మండల పరిధిలో ఎత్తిపోతల పథకాల పరిధిలో పంట కోతకు వచ్చిందని రైతులు తెలిపారు. ఇరిగేషన్ అధికారులు పొలాలను తరుచూ పరిశీలించాలని రైతులు డిమాండ్ చేస్తున్నారు.

పోలీసుల అదుపులో ఫాస్ట్‌ఫుడ్ సెంటర్ నిర్వాహకుడు

బోట్‌క్లబ్: ఫాస్ట్‌ఫుడ్ సెంటర్‌ను తనిఖీ చేసి కేసు నమోదు చేసిన ఫుడ్ సేఫ్టీ అధికారులను ఫోన్‌లో బెదిరించిన వ్యక్తిని టూటౌన్ పోలీసులు మంగళవారం అదుపులోకి తీసుకున్నారు. పోలీసులు కథనం ప్రకారం టూటౌన్ సమీపంలో శివదుర్గ ఫాస్ట్‌ఫుడ్ సెంటర్‌ను ఈ నెల 24న ఫుడ్ సేఫ్టీ ఇన్‌స్పెక్టర్ నాగూల్‌మీరా తనిఖీ చేశారు. వంట నూనె బాగా రంగుమారిపోవడంతో కేసు నమోదు చేశారు. తాను లేని సమయంలో వచ్చి ఫాస్ట్‌ఫుడ్ సెంటర్ తనిఖీ చేసిన ఇన్‌స్పెక్టర్‌కు ఫోన్ చేసి బెదిరించడంతో అధికారులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీంతో సెంటర్ నిర్వాహకుడు శివను అదుపులోకి తీసుకున్నారు.

రాములోరి పెళ్లికి సర్వం సిద్ధం

- ఆలయాల్లో వేడుకలకు ఏర్పాట్లు పూర్తి
- రేపు శ్రీరామ నవమి



పిఠాపురం చిట్టోడితోటలో సీతారాముల వారు



వేడుకలకు సిద్ధమైన గోర్సలో పురాతన సీతారామాలయం

పిఠాపురం: శ్రీరామ రామ రామేతి రమే రామే మనోరమే సహస్రనామ తత్తుల్యం రామ నామ వరాననే అనే శ్లోకాన్ని శ్రీరామ నవమి రోజున చదువుకుంటే విష్ణు సహస్రనామం వెయ్యి శ్లోకాలు చదివిన ఫలితం వస్తుందని పురాణాలు చెబుతున్నాయి. ఎన్నో విశిష్టతలు కలిగిన శ్రీరామ నవమి వేడుకలకు రంగం సిద్ధమైంది. రామాలయం లేని వీధి ఉండదంటే అతిశయోక్తి కాదు. ప్రతి గ్రామంలోను ప్రతి వీధిలోను రామాలయాలు ఉంటాయి. శ్రీరామ నవమి వస్తోందంటే వీధుల్లో రామాలయాలు పెళ్లి సందడితో కళకళలాడుతువటాయి. రాముల వారి పెళ్లి ఊరంతా సంబరాలు అన్నట్టుగా జరుగుతాయి. శ్రీరామ నవమి ఉత్సవాల్లో శ్రీసీతా రాముల దివ్య కల్యాణానికి సర్వం సిద్ధం చేశారు. పిఠాపురం నియోజక వర్గంలోని అన్ని రామాలయాల్లోనూ ఏర్పాట్లు పూర్తి చేశారు. గురువారం శ్రీరామ నవమి సందర్భంగా ఎక్కడ చూసినా చలువ పందిళ్లు, పచ్చని తోరణాలతో రామాలయాలు కళకళలాడుతున్నాయి. సీతారాముల కల్యాణం సందర్భంగా బుధవారం పలుచోట్ల రాముల వారిని సీతమ్మను పెళ్లి కుమారుడు, పెళ్లి కుమార్తెలను చేసే హడావుడితో వేదఘోష మార్మోగనున్నాయి. రామాలయాలు భక్తులతో కిటకిటలాడనుండగా భక్తులకు పానకాలు, విసినకర్రలు, వడపప్పు, పులిహోరాలు పంపిణీ చేసేందుకు భారీ ఏర్పాట్లు చేశారు. పలుచోట్ల భారీ అన్న సమారాధనలు నిర్వహించనున్నారు. పలువురు ప్రజాప్రతినిధులు సీతారామ కల్యాణోత్సవాల్లో పాల్గొనడానికి సిద్ధమవుతున్నారు. ఇప్పటికే సాంప్రదాయ బద్ధంగా సీతారాముల కల్యాణోత్సవాలు భక్తుల రామనామస్మరణల మధ్య కనుల పండువగా ప్రారంభం కావడంతో ప్రతి వీధిలోనూ ఉన్న రామాలయాల్లో కల్యాణోత్సవాలు జరగనుండడంతో గ్రామాలన్నీ కల్యాణ ఉత్సవాలతో కళకళలాడుతున్నాయి.

ప్రధాన సమస్యల పరిష్కారానికి చర్యలు

- ఎమ్మెల్యే పెండెం దొరబాబు
- గోకివాడలో గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం



ప్రభుత్వ పథకాలను వివరిస్తున్న ఎమ్మెల్యే పెండెం దొరబాబు

పిఠాపురం: ప్రధాన సమస్యల పరిష్కారానికి ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నట్టు ఎమ్మెల్యే పెండెం దొరబాబు అన్నారు. ఆయన మంగళవారం పిఠాపురం మండలం గోకివాడలో గడపగడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ప్రతీ ఇంటికీ వెళ్లి వారికి అందుతున్న పథకాలను చదివి విని పించి అవన్నీ అందుతున్నాయా లేదా అంటూ లబ్ధిదారులను అడిగి తెలుసుకున్నారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ గడపగడపకూ మన ప్రభుత్వ కార్యక్రమంలో ప్రజల నుంచి వస్తున్న విజ్ఞప్తులను స్వీకరించి వాటి పరిష్కారానికి వెంటనే తగిన చర్యలు తీసుకుంటున్నామన్నారు. ముఖ్యంగా ప్రధాన సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారని వాటిపై దృష్టి పెడుతున్నామన్నారు. గడపగడపకూ కార్యక్రమానికి వస్తున్న స్పందన ప్రతి పక్షాల గుండెల్లో రైళ్లు పరిగెట్టిస్తోందన్నారు. ఇప్పటి వరకూ ఏ ప్రభుత్వం చేయని విధంగా రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను వంద శాతం అమలు చేసి ముఖ్యమంత్రి అంటే ఇలా ఉండాలి అనిపించారన్నారు. గత టీడీపీ హయాంలో వైఎస్సార్ సీపీ కార్యకర్తలకు ఒక్క పథకం కూడా అందకుండా వివక్షత చూపించారని ఆయన విమర్శించారు. ప్రస్తుతం పార్టీలకు అతీతంగా పథకాలు పంపిణీ చేస్తున్నామన్నారు. ఎన్నికలు అయిపోగానే కనిపించని నేతలు ఉన్న ప్రస్తుత రాజకీయాలలో పదవిలో ఉన్నప్పుడే ప్రజల చెంతన ఉండాలని ఆదేశిస్తు రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడి ఎమ్మెల్యేలను గడపగడపకూ మన ప్రభుత్వం పేరుతో ప్రజల చెంతకు పంపిస్తున్నారన్నారు. తద్వారా ప్రజల సమస్యలు తెలుసుకుని వాటి పరిష్కారంకు చర్యలు తీసుకుంటున్నామని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో వచ్చే సమస్యల పరిష్కారంకు ప్రత్యేక నిధులు సైతం విడుదల చేయడంపై గ్రామాల్లో నెల కొన్న పలు సమస్యలకు పరిష్కారం లభిస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ కీర్తి హరినాథబాబు, ఎంపీటీసీ వేమగిరి చిన నాగరాజు, జెడ్పీ వైస్ చైర్మన్ బుర్రా అనుబాబు, వైఎస్సార్ సీపీ జిల్లా యువజన విభాగం అధ్యక్షుడు కొప్పన శివనాథ్, గరగ మహేశ్వరరావు, గరగ వీరన్న వార్డు సచివాలయ సిబ్బంది, వలంటీర్లు వైఎస్సార్ సీపీ నేతలు తదితరులు పాల్గొన్నారు.

పేదల సంక్షేమమే సీఎం లక్ష్యం

- మాధవపట్నంలో గడపగడపకు..
- పథకాల లబ్ధిని వివరించిన దవులూరి



మాధవపట్నంలో లబ్ధిదారులతో మాట్లాడుతున్న దవులూరి దొరబాబు

సామర్లకోట: పేదల సంక్షేమమే లక్ష్యంగా సీఎం జగన్ పని చేస్తున్నారని హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్ దవులూరి దొరబాబు అన్నారు. మంగళవారం మార్కెట్ కమిటీ చైర్మన్ మేడిశెట్టి వీరభద్రం, గ్రామ సర్పంచ్ మేడిశెట్టి సుగుణమ్మ, ఎంపీటీసీ సభ్యులు మేడిశెట్టి దుర్గాదేవి, గుత్తుల కృష్ణార్జునరావుల ఆధ్వర్యంలో రాష్ట్ర హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్ దవులూరి దొరబాబు గడపగడపకూ వెళ్లి మూడేళ్లలో అందుకున్న లబ్ధిని ప్రజలను అడిగి తెలుసుకున్నారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీలను సీఎం జగన్ అమలుచేశారని, లబ్ధిదారులకు పథకాలు అందుతున్నాయా లేదో తెలుసుకోవడానికే గడపగడపకు మన ప్రభుత్వం నిర్వహిస్తున్నట్టు తెలిపారు. ఎంపీపీ బొబ్బరాడ సత్తిబాబు, ఎంపీడీఓ డి.శ్రీలలిత, పంచాయతీ కార్యదర్శి సాధనాల నాగఫణిబాబు, సొసైటీ అధ్యక్షుడు వీరంరెడ్డి నాని, వైఎస్సార్ సేవాదళ్ జిల్లా అధ్యక్షుడు మేడిశెట్టి వెంకటరమణ, బొందిలి డైరెక్టరు తోట సత్యనారాయణ, పార్టీ నాయకుడు తొలెం లోవరాజు, వీఆర్వోలు సచివాలయ కార్యదర్శులు, వలంటీర్లు పాల్గొన్నారు.

విద్యార్థిని మృతిపై విచారణ



కేటీసీ హస్టల్‌లో విచారణ చేస్తున్న డీఈఓ, స్త్రీ.శిశుసంక్షేమ శాఖ పీడీ, ఎంఈఓ తదితరులు



సోనా కుమారి (పాత చిత్రం)

సామర్లకోట: మండల పరిధిలోని అచ్చంపేట శివారు బ్రహ్మానందపురంలోని కేటీసీ హస్టల్‌లో ఉంటున్న విద్యార్థిని సోనా కుమారి (11) మృతిపై మంగళవారం అధికారులు విచారణ ప్రారంభించారు. జార్ఖండ్‌కు చెందిన విద్యార్థిని తల్లిదండ్రులు తమ కుమార్తె మానసిక పరిస్థితిని దృష్టిలో ఉంచుకుని రెండో తరగతిలో చేర్చారు. అయితే సోనా కుమారి మృతి చెందడంతో జిల్లా కలెక్టరు విద్యాశాఖ, స్త్రీ, శిశుసంక్షేమ శాఖ అధికారులను విచారించాలని ఆదేశించారు. జార్ఖండ్ నుంచి విద్యార్థిని తల్లిదండ్రులు రావడంతో వారి సమక్షంలో డీఈఓ అన్నపూర్ణ, స్త్రీ, శిశుసంక్షేమ శాఖ పీడీ కె.ప్రవీణ, మండల విద్యాశాఖ అధికారి వై.శివరామ కృష్ణ మంగళవారం విచారణ ప్రారంభించారు. హస్టల్‌లో పని చేస్తున్న ఎస్.లక్ష్మీరాజ్ నుంచి తిమ్మాపురం పోలీసులు సమాచారం సేకరించారు. సోమవారం సోనా కుమారి అనారోగ్యానికి గురి కావడంతో రాగిజావ తాగించామని, దాంతో వాంతులు చేసుకుందని లక్ష్మీరాజ్ పోలీసులకు తెలిపారు. వెంటనే ఏడీబీ రోడ్డులోని మెడికవర్ ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందిన్నట్టు ఇంద్రపాలెం పోలీసులు తెలిపారు. విద్యార్థిని మృతిపై పూర్తి వివరాల కోసం మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కాకినాడ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించినట్టు ఎంఈఓ వై.శివరామకృష్ణయ్య తెలిపారు. తిమ్మాపురం పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తు న్నారు. బుధవారం పూర్తి స్థాయిలో అధికారులు కేటీసీ హాస్టల్‌లో విచారణ జరపనున్నారని ఎంఈఓ తెలిపారు.

మేలుజాతి పశువులతో ఆదాయ వృద్ధి



వాకాడలో ఏర్పాటు చేసిన లేగదూడల ప్రదర్శన

కరప: పశు సంవర్ధకశాఖ సూచనల మేరకు మేలు జాతి పశువులను పెంచడం ద్వారా పాల ఉత్పత్తిని, తద్వారా ఆదాయాన్ని వృద్ధి చేసుకోవచ్చని ఎంపీపీ పెంకే శ్రీలక్ష్మి పేర్కొన్నారు. మండలం వాకాడలో మంగళవారం పశుసంవర్ధకశాఖ, పశుగణాభివృద్ధి సంస్థ సంయుక్తంగా ఏర్పాటు చేసిన జాతీయ కృత్రిమ గర్భధారణ కార్యక్రమంలో లేగదూడల ప్రదర్శనను ఆమె ప్రారంభించి మాట్లాడారు. సబ్ డివిజన్ ఏడీ డాక్టర్ ఎన్‌జేఎస్ సురేష్‌బాబు మాట్లాడుతూ పశుపోషణ, లేగదూడల పెంపకంపై పాడిరైతులకు అవగాహన కల్పించేందుకే ఈ ప్రదర్శన ఏర్పాటుచేసినట్టు తెలిపారు. పశు వ్యాధులకు సంబంధించి ఆర్‌బీకేలలో కానీ, సమీపంలోని పశువైద్యశాలలో కానీ సంప్రదించి మకాంలలో మందులు పిచికారీ చేయాలన్నారు. తర్వాత ఇంజక్షన్లు చేయించాలన్నారు. పశుగణాభివృద్ధి సంస్థ డాక్టర్ ఎం.భవాని మాట్లాడుతూ పాడిరైతులు రూ.500 చెల్లిస్తే మేలు జాతి పెయ్యిదూడల ఉత్పత్తికి కృత్రిమ గర్భధారణ ఇంజెక్షన్ చేస్తామన్నారు. దీనిని పశురైతులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. లేగదూడల ప్రదర్శనలో 30 మంది రైతులు పాల్గొనగా వరసగా దుగ్గల కృష్ణ, దూడల నారాయుడు, చోడిశెట్టి సత్యనారాయణ, ఆకుల శ్రీరామమూర్తి, ముమ్మిడి అమ్మన్న, సుంకర సుబ్బారావు, దూడల వీరాస్వామిలకు బహుమతులు, మిగిలిన రైతులకు కన్సోలేషన్ బహుమతులు వచ్చాయి. ఎంపీపీ శ్రీలక్ష్మి, వైఎస్సార్ సీపీ నాయకులు అడబాల ప్రసాద్, పెంకే సత్తిబాబు బహుమతులు అందజేశారు. మండల పశువైద్యాధికారి డాక్టర్ ఎం.రవికిరణ్ బాబు, వేళంగి పశువైద్యాధికారి పి.అనిల్ విల్సన్, వీఏలు పి.దుర్గాప్రసాద్, ఎం.మణికంఠ, పి.శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

గ్రామాల అభివృద్ధే ధ్యేయం

రూ.19 లక్షలతో పనులు



వాటర్ ట్యాంకును పరిశీలిస్తున్న దృశ్యం

కొత్తపల్లి: గ్రామాల అభివృద్ధే ప్రభుత్వ ధ్యేయమని మండల కో ఆప్షన్ సభ్యుడు కారే శ్రీనివాసరావు అన్నారు. మండలంలో కొమరగిరిలో రూ.19 లక్షల మండల పరిషత్ నిధులతో జరుగుతున్న అభివృద్ధి పనులను మంగళవారం ఆయన పరిశీలించారు. ఈ పనులను వైస్ ఎంపీపీ చెట్టుబత్తిన సురేష్‌కుమార్ ఆధ్వర్యంలో చేపడుతున్నారు. రెండు గ్రావెల్ రోడ్లకు రూ.3.50లక్షలు, సగరులు, రెడ్లు, ఎస్సీపేటకు చెందిన ముడు శ్మశానవాటికల్లో వాటర్ ట్యాంకుల నిర్మాణానికి రూ.9లక్షలు, బలిజ శ్మశాన వాటికలో దహన సంస్కారాల షెడ్డు నిర్మాణానికి రూ.2.50 లక్షలు, రామాలయం వద్ద సీసీ డ్రైన్ రూ.3లక్షలతో పనులు జరుగుతున్నాయి. ఈ సందర్భంగా కారే శ్రీనివాసరావు మాట్లాడుతూ గ్రామ అభివృద్ధికి ఎమ్మెల్యే పెండెం దొరబాబు ఎంతో కృషి చేశారన్నారు. వైఎస్సార్ సీపీ మండలాధ్యక్షుడు ఆనాల సుదర్శన్, గ్రాం్రాల వెలమరెడ్డి, కటారి చంటిబాబు, నంగన అన్నవరం, కాజులూరి రమణారెడ్డి, గుల్లపల్లి సత్యనారాయణ, మేడే వెంకటరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కూరాడలో చోరీ

కరప: తిరుమల తీర్థయాత్రకు వెళ్లిన స్థానిక కుటుంబానికి చెందిన బంగారు ఆభరణాలు, నగదు అపహరణకు గురయ్యాయి. బాధితుల ఫిర్యాదు మేరకు దొంగతనం కేసునమోదు చేసినట్టు ఎస్ఐ నౌడు రామకృష్ణ తెలిపారు. ఎస్ఐ కథనం మేరకు.. కూరాడ గ్రామానికి చెందిన ఫీల్డు అసిస్టెంట్ వాసంశెట్టి గోవిందరాజులు ఈనెల 13న కుటుంబ సభ్యులతో కలసి తిరుపతి వెంకటేశ్వరుని దర్శనానికి వెళ్లారు. ఆయన ఇంటి పైఅంతస్తులో అమ్మమ్మ కాదా నారాయణమ్మ నివాసముంటోంది. ఆమెకు తోడుగా బాధితుని చిన్నమ్మ మేడిశెట్టి కృష్ణవేణి రాత్రి సమయంలో పడుకుంటోంది. 15వ తేదీన ఉదయం కృష్ణవేణి చూసేసరికి గోవిందరాజులు ఇంటి తాళాలు బద్దలు కొట్టి ఉండగా, లోపలి సామాన్లు చిందరవందరగా పడి ఉన్నాయి. ఆమె సమాచారంతో గోవిందరాజులు వచ్చి గొలుసు, మంగళ సూత్రాలు, ఉంగరాలు వంటి ఆభరణాలు దొంగలు అపహరించినట్టు గుర్తించి ఫిర్యాదు చేశారు.

మహిళలు ఆర్థికాభివృద్ధి సాధించాలి



మహిళా సంఘాల సభ్యులకు ఆసరా చెక్కు అందజేస్తున్న ఎమ్మెల్యే పెండెం దొరబాబు

- ఎమ్మెల్యే పెండెం దొరబాబు
- పిఠాపురంలో వైఎస్సార్ ఆసరా నమూనా చెక్కు పంపిణీ

పిఠాపురం: ప్రభుత్వ ఆర్థిక సహాయాన్ని ఆసరాగా చేసుకుని అభివృద్ధి సాధించాలని, ఆసరా పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే పెండెం దొరబాబు మహిళా సంఘాల సభ్యులకు పిలుపునిచ్చారు. పిఠాపురంలో మంగళవారం ఏర్పాటు చేసిన వైఎస్సార్ ఆసరా మూడో విడత లబ్ధిదారులకు చెక్కుల పంపిణీ కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. పిఠాపురం మండల పరిదిలో అర్హత గల 1586 సంఘాలకు చెందిన 15860 మంది లబ్ధిదారులకు రూ.13.51కోట్లను చెక్కుల రూపంలో అందజేస్తున్నట్టు ఆయన తెలిపారు. రెండో విడత అందజేస్తున్న ఈ ఆర్థిక సహాయంతో మహిళా సంఘాల సభ్యులు ఆర్థికంగా నిలదొక్కుకోడానికి ఉపయోగించుకోవాలని ఆయన విజ్ఞప్తి చేశారు. ప్రభుత్వం మహిళల అభివృద్ధికి పెద్దపీట వేస్తోందని, వారి కోసం ప్రవేశపెట్టిన పథకాలను సద్వినియోగం చేసుకోవాలని ఆయన సూచించారు. రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మహిళల అభివృద్ధికి అనేక పదకాలను ప్రవేశ పెట్టి అమలు చేస్తున్నారని రాజకీయ పదవులు సైతం పురుషుల కంటే ఎక్కువ ప్రాధాన్యత ఇస్తున్నారన్నారు. ఇచ్చిన మాట ప్రకారం ఈ కార్యక్రమంలో జెడ్పీ వైస్ చైర్మన్ బుర్రా అనుబాబు, వైఎస్సార్ సీపీ యువజన విభాగం అధ్యక్షుడు కొప్పన శివనాథ్, వైఎస్సార్ సీపీ మహిళా విభాగం జిల్లా అధ్యక్షురాలు వర్ధినీడి సుజాత, ఎంపీపీ కన్నాబత్తుల కామేశ్వరరావు, డీఆర్‌డీఏ ఏరియా కోఆర్డీనేటర్ అశోక్‌భరత్, ఏపీఎం సీహెచ్ ప్రియదర్శిని, ప్రత్యేకాధికారి సునీల్ ఎంపీడీఓ వెంకటేశ్వరరావు, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, మహిళా సంఘాల నాయకులు, మహిళలు తదితరులు పాల్గొన్నారు. అనంతరం పలువురు మహిళలతో కలిసి రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చిత్ర పటానికి క్షీరాభిషేకం చేశారు.

క్రీడల అభివృద్ధికి మరింత కృషి

ఎమ్మెల్యే పెండెం దొరబాబు



బొజ్జా మాణిక్యాలరావును సత్కరిస్తున్న ఎమ్మెల్యే దొరబాబు

పిఠాపురం: క్రీడల అభివృద్ధికి మరింత పాటుపడాలని తద్వారా రాష్ట్రంలో మంచి క్రీడాకారులను తయారు చేయాలని ఎమ్మెల్యే పెండెం దొరబాబు సూచించారు. ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లా బాస్కెట్ బాల్ అసోసియేషన్ కార్యదర్శి బొజ్జా మాణిక్యాలరావు ఇటీవల జరిగిన రాష్ట్ర బాస్కెట్ బాల్ అసోసియేషన్ ఎన్నికల్లో రాష్ట్ర సంయుక్త కార్యదర్శిగా నియమితులైన సందర్భంగా మంగళవారం ఎమ్మెల్యే దొరబాబును మార్యద పూర్వకంగా కలుసుకుని కృతజ్ఞతలు తెలిపారు. బొజ్జా మాణిక్యాలరావు, బొజ్జా జగదీశ్వరి దంపతులను ఎమ్మెల్యే దుశ్శాలువాతో ఘనంగా సత్కరించి అభినందించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ బాస్కెట్ బాల్‌లో జాతీయ స్థాయి అవార్డులు గెలుచుకున్న క్రీడాకారులు ఎందరో పిఠాపురంలో ఉన్నారని వారి పేరును నిలబెట్టేలా రానున్న రోజుల్లో మరింత మంది బాస్కెట్‌బాల్ క్రీడాకారులను సిద్ధం చేయడానికి కృషి చేయాలని ఆయన సూచించారు. ఈ కార్యక్రమంలో పలువురు కౌన్సిలర్లు పాల్గొన్నారు.

కమీషన్ ఇస్తేనే రుణాలు

- ఏపీఎం విచారణలో మహిళా సంఘాలు
- యానిమేటర్లను తొలగించాలని డిమాండ్



యానిమేటర్లపై ఏపీఎంకు ఫిర్యాదులు చేసిన మహిళా సంఘాల సభ్యులు

సామర్లకోట: మహిళా సంఘాల నుంచి సొమ్ములు డిమాండ్ చేస్తున్న యానిమేటర్లను తొలగించాలని పీబీ దేవం మహిళా సంఘాల సభ్యులు డిమాండ్ చేశారు. బ్యాంకుల నుంచి రుణాలు పొందాలంటే యానిమేటర్లకు కమీషన్లు ఇవ్వాల్సి వస్తోందని పలు సంఘాల సభ్యులు ఆరోపించారు. స్పందనలో ఇటీవల చేసిన ఫిర్యాదు మేరకు ఏపీఎం ప్రశాంతి బృందం మంగళవారం పీబీ దేవం పంచాయతీ కార్యాలయం వద్ద విచారణ చేశారు. బ్యాంకుల నుంచి రుణాలు వచ్చిన సమయంలో రూ.10 లక్షలకు రూ.10వేలు డిమాండ్ చేస్తున్నారని పలువురు మహిళలు ఆరోపించారు. ఈ మేరకు మీకు జీతాలు వస్తున్నాయి కదా, ఎందుకు కమీషన్ ఇవ్వాలని ప్రశ్నిస్తే రుణాలు నిలిపివేస్తామని బెదిస్తున్నారని మహిళా సంఘాల సభ్యులు ఫిర్యాదులు చేశారు. యానిమేటర్లపై చర్యలు తీసుకోవడం కాదని వారిని విధుల నుంచి తొలగించాలని మహిళా సంఘాల సభ్యులు డిమాండ్ చేశారు. ఎంపీటీసీ సభ్యుడు మలకల సూరిబాబు, సొసైటీ అధ్యక్షుడు మలకల వరహాలబాబు, గ్రామ సర్పంచ్ నీలపాల సత్యనారాయణ, ఉప సర్పంచ్ మలకల సత్య తదితరులు పాల్గొన్నారు.

కొనసాగుతున్న స్వచ్ఛ సంకల్ప శిక్షణ



ఉండూరు సంపద తయారీ కేంద్రాన్ని పరిశీలించిన ఆయా గ్రామాల సర్పంచ్, పంచాయతీ సిబ్బంది

సామర్లకోట: మండల పరిధిలోని ఉండూరు గ్రామంలో సంపద తయారీ కేంద్రం వద్ద నిర్వహిస్తున్న స్వచ్ఛ సంకల్ప శిక్షణ మంగళవారం కొనసాగింది. జిల్లా పరిధిలో ఏడు మండలాల్లోని మోడల్ గ్రామాల్లో ప్రజా ప్రతినిధులు, పంచాయతీ అధికారులకు ఉండూరులో శిక్షణ ఇస్తున్నారు. ఉండూరు సంపద తయారీ కేంద్రం జాతీయ స్థాయి అవార్డు పొందడంతో కొన్ని మండలాలకు ఈ సంపద తయారీ కేంద్రంలో శిక్షణ ఇవ్వాలని నిర్ణయించారు. దాంతో ఐదో బ్యాచ్‌లో కిర్లంపూడి మండల పరిధిలోని రాజుపాలెం, ముక్కోలు, పాలెం, సింహాద్రిపురం, కృష్ణవరం గ్రామాలోని పంచాయతీ సర్పంచ్‌లు, పంచాయతీ కార్యదర్శులు, ఇంజినీరింగ్ అసిసెంట్లు, వీఏఏలకు మంగళవారం ఒక రోజు శిక్షణ నిర్వహించారు. ఇంటింటా చెత్త సేకరణ, తడిచెత్త, పొడి చెత్త సంపద తయారీ కేంద్రానికి తరలించే విధానం, తడిచెత్త నుంచి వర్మీ కంపోస్టు తయారీ విధానాలపై గ్రామ పంచాయతీ కార్యదర్శి కుమార్ రాజా శిక్షణ ఇచ్చారు. సంపద తయారీ కేంద్రంలో వర్మీ కంపోస్టు యూనిట్‌తో వేసిన మొక్కలను శిక్షణ పొందే వారు సందర్శించే ఏర్పాట్లు చేశారు. ఈ శిక్షణ తీరును ఎంపీడీఓ డి.శ్రీలలిత పరిశీలించారు.

వృద్ధుల ఫిర్యాదులకు ప్రత్యేక కౌన్సెలింగ్ కేంద్రం

- ఆర్డీవో బీవీ రమణ
- ట్రిబ్యునల్ ద్వారా సత్వర పరిష్కారం

కాకినాడ సిటీ: వయోవృద్ధుల నుంచి వచ్చే ఫిర్యాదులను పరిశీలించి, తొలి దశలో కౌన్సెలింగ్ ద్వారా పరిష్కరించేందుకు వీలుగా డివిజన్ స్థాయిలో ప్రత్యేక కౌన్సెలింగ్ కేంద్రాన్ని ఏర్పాటు చేయనున్నట్లు ఆర్డీవో బీవీ రమణ తెలిపారు. మంగళవారం ఆయన కార్యాలయ సమావేశ మందిరంలో తల్లిదండ్రులు, వయోవృద్ధుల సంక్షేమంపై అవగాహన సదస్సులో ఆయన మాట్లాడారు. కౌన్సెలింగ్ ద్వారా కొన్ని సమస్యలు పరిష్కరించేందుకు కేంద్రాన్ని ఏర్పాటు చేస్తున్నట్టు తెలిపారు. వివిధ శాఖల అధికారులు, సీనియర్ సిటిజెన్ వెల్ఫేర్ అసోసియేషన్ల ప్రతినిధులు ఉంటారని, ఈ కేంద్రం ద్వారా వారంలో ఒకరోజు సేవలు అందించనున్నట్లు వివరించారు. సమావేశంలో పాల్గొన్న విభిన్న ప్రతిభావంతులు, ట్రాన్స్‌జెండర్, వయోవృద్ధుల సంక్షేమశాఖ ఏడీ వి.కామరాజు మాట్లాడుతూ సమన్వయ శాఖల అధికారులతో కలిసి చట్టపరంగా వృద్ధులకు ఉన్న హక్కులపై అవగాహన కల్పించనున్నట్టు తెలిపారు. జిల్లా సీనియర్ సిటిజన్స్ అసోసియేషన్ అధ్యక్షుడు బి.సత్యనారాయణరాజు మాట్లాడుతూ మనల్ని కని పెంచి పెద్ద చేసిన తల్లిదండ్రులను బాగా చూసుకోవాల్సిన బాధ్యత మనపై ఉందన్నారు. ఫ్యామిలీ ఫిజీషియన్, 104 సేవలు, ఆసుపత్రుల్లో ప్రత్యేక ఏర్పాట్లు తదితరాలపై డీఎంహెచ్‌వో డాక్టర్ ఆర్ రమేష్ వివరించారు. హెల్పేజ్ ఇండియా ప్రతినిధి పి శ్యామ్‌కుమార్ మాట్లాడుతూ తల్లిదండ్రులు, వయోవృద్ధుల సంక్షేమ చట్టంలోని వివిధ సెక్షన్ల పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించారు. ఈ డివిజన్ స్థాయి ట్రిబ్యునల్‌కు ఆర్డీవో చైర్‌పర్సన్‌గా ఉంటారని, అలాగే అప్పిలేట్ ట్రిబ్యునల్‌కు కలెక్టర్ చైర్‌పర్సన్‌గా ఉంటారన్నారు. జాతీయ వయోవృద్ధుల హెల్ప్‌లైన్ 14567 కరపత్రాన్ని ఆవిష్కరించారు. సీనియర్ సిటిజన్స్ సంక్షేమ సంఘం (పెద్దాపురం) అధ్యక్షుడు సూర్యనారాయణమూర్తి, డివిజనల్ ట్రిబ్యునల్ మెంబర్ ఆర్.రవిశంకర్ పట్నాయక్ తదితరులు పాల్గొన్నారు.

ఎస్సీ, ఎస్టీల సమస్యల పరిష్కారానికి ప్రత్యేక కృషి

డివిజన్ పరిధిలోని ఎస్సీ, ఎస్టీల సమస్యల పరిష్కారానికి ప్రత్యేక కృషి చేస్తున్నట్టు ఆర్డీఓ బీవీ రమణ అన్నారు. మంగళవారం ఆర్డీవో కార్యాలయంలో నిర్వహించిన విజిలెన్స అండ్ మోనిటరింగ్ కమిటీ (ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీస్) సమావేశంలో ఆయన మాట్లాడారు. పెండింగ్ అట్రాసిటీ కేసుల క్షుణ్ణంగా పరిశీలించి అర్హులకు సాయం చేస్తామని అన్నారు. డివిజన్ పరిధిలో ఎమ్మార్వోలకు కుల ధ్రువీకరణ పత్రాల జారీలో ఎటువంటి జాప్యంల లేకుండా సంబంధిత తహసీల్దార్లు చర్యలు చేపట్టాలని ఆదేశించారు. ఇందుకు రెవెన్యూ, పోలీస్ అధికారులు సమన్వయంతో పనిచేయాలని అన్నారు. డీఎస్పీ మురళీకృష్ణారెడ్డి మాట్లాడుతూ డివిజన్ పరిధిలో ఎస్సీ, ఎస్టీ విజిలెన్స అండ్ మానిటరింగ్ సభ్యులు తమ దృష్టికి తీసుకొచ్చిన వివిధ సమస్యల పరిష్కారానికి చిత్తశుద్ధితో కృషి చేస్తున్నామని అన్నారు. సమావేశానికి జిల్లా స్థాయి విజిలెన్స్ అండ్ మానిటరింగ్ కమిటీ సభ్యులు డోకుబుర్ర భద్రం, డాక్టర్ మోహా పవన్‌కుమార్ హాజరయ్యారు.